# కుర్చీ

ఏ వస్తువు మీదనైనా కవిత్వం రాయొచ్చు అంటే, కథ కూడా రాయొచ్చు. ఓపిక లేని వాడు కథ రాస్తే, తీరుబడీ, ఓపిక ఉన్నవాళ్ళు, అల్లిక పని వచ్చినవాళ్ళు - నవలేమిటి, మహాభారతం రాయొచ్చు!

మహాభారతం అంతా కుర్చీ గురించే కదా జరుగుత. కైక తన కొడుకుని కుర్చీ మీద కూర్చోపెట్టాలని అనుకోవడంతోటే ఆరంభమైంది కదా అసలు రామాయణమంతా! విష్ణువు ఎన్ని అవతారాలు ఎత్తినా, ఇంద్రుడు ఎంత మంది దేవ నర్తకిలను ఎందరి మీదకు ఉసిగొల్పినా, ఈ మాయదారి కుర్చీయే మూల కారణం. ఆది కాలం నుంచీ ఆధునిక కాలం వరకూ ప్రపంచ చరిత్రలో జరిగిన కుట్రలూ, యుద్ధాలూ, దారుణ మారణ హోమాలూ, రాజకీయాలూ ఈ కుర్చీని గురించే కదా జరుగుత, జరుగుతూంట!

ఒక్క మనిషి కూర్చోవడానికి సరిపడేంత నాలుగు కాళ్ళ బల్లకి వీపు ఆన్చుకోవడానికి (అలాగని గోడకి జేరవెయ్యమని కాదు) ఇంత సదుపాయం చేస్తే, అదే కుర్చీ అవుతుంది. పిండి కొద్దీ రొట్టె అన్నట్టు డబ్బున్న కొద్దీ కుర్చీ అందచందాలు ఇనుమడింపచెయ్యవచ్చు. కూర్చునే వారి సుఖాన్ని ఎక్కువ చేయవచ్చు. ఆధునిక గృహాంతరాలంకరణ శాస్త్రరీత్యా, డ్రాయింగ్ రూమ్‌కీ, డైనింగ్ టేబుల్‌కి ఒకే రకం కుర్చీలు వాడరాదు. డాబా మీది కుర్చీలు తోటలోకి పనికిరావు.

అయితే, చెప్పబోయేది, 'మీ తాత మొదటి సంపాదనతో చేయించిన కుర్చీ ఇది! దీన్ని ఇలా ఉంచవల్సిందే, అటక మీద పడవేయడానికి వీలు లేదు!' అనే నాయనమ్మ కుర్చీ గురించి కాదు.

ఒకట్ల స్థానంలో ఉన్న ఒకటి విలువ ఒకటి. వందల స్థానంలో ఉన్న ఒకటి విలువ వంద. అలాగే కుర్చీ విలువా, హోదా గేటు దగ్గర మొదలై, ఆఫీసులో కంటా వెడుతుండగా పెరుగుతూ పోతాయి. అంతంతమాత్రం చదువుకున్న ఆసామీ (గేటు దగ్గర కాకపోయినా) ఆఫీసు గుమ్మం దగ్గర మొదలుపెట్టి, ఒక్కొక్క కుర్చీని ఆక్రమిస్తూ, ఏళ్ళ తర్వాత పెద్ద కుర్చీలో కూర్చుంటే, అతని మనస్తత్వమూ, పరివర్తనా అదోలా ఉంటాయి. అనుభవానికి మించినది మరేదీ లేదనుకొంటాడు.

పెద్ద చదువులు చదివి, ఒకటి రెండు కప్పదాట్లతో ఆ కుర్చీని ఆక్రమించినవాడి మనస్తత్వం మరోలా ఉంటుంది. చదువుని మించింది మరొకటి లేదనుకొంటాడు. గొడవ ఎక్కడొస్తుందంటే, వీళ్లు ఒకళ్ల కింద మరొకరు పని చెయ్యవలసి వచ్చినప్పుడు!

మా ఎస్.ఇ. (సీనియర్ ఇంజనీర్) పూర్వకాలంలో ఉన్న సిన్సియారిటీ ఈ కాలంలో లేదంటాడు.

పరిస్థితులు మారాయి. ప్రజల దృక్పథం మారింది. దేశం నత్త నడకతో ఏదో ప్రగతిని సాధిస్తున్నట్లు కనపడుతున్నా, పనిలో పటుత్వం తగ్గింది. పనిచేసే వాడొకడూ, పాటలు పాడే వాళ్ళూ పది మందీ! పనిచేసే ఆ కొద్ది మందీ ఆకాశానికి గుంజల్లా ఉంటున్నారు. అందుకే, నిర్ణీతమైన సమయంలో ఎంత గింజుకున్నా, శ్రమపడ్డా పని చేయించలేకపోయాను. సాయంకాలం వరకూ సైట్‌లో అవుతుందనుకొన్న పని జరగలేదు. మర్నాటికి పని జరిగి తీరాలి. పదిమందిని ఓ.టి. (ఓవర్ టైమ్‌లో) పెట్టి దగ్గరుండి రాత్రి రెండింటికల్లా పని పూర్తయిందనిపించాను.

మర్నాడు ఆఫీసుకు వెళ్ళగానే ఎస్.ఇ.ని కలుసుకొని పది మందిని ఓ.టిలో పెట్టి పని పూర్తి చేయించిన సంగతి చెప్పి, ప్రాజెక్టు మేనేజర్‌కి శాంక్షన్ కోసం ఫైల్ పంపమన్నాను. "వాళ్ళకి రెండు మూడు రోజులలో ఈ ఓ.టి. డబ్బులు దొరికేటట్లు చేస్తానని వాగ్దానం చేసి, బ్రతిమాలితేనే కాని పని జరగనేలేదు! రెండు నెలల క్రితం వాళ్ల బిల్ సకాలంలో పాస్ కానందున నానా గొడవ చేశారు!" - ఎస్.ఇ.ని హెచ్చరించాను.

"ఈ అడ్మినిస్ట్రేషన్‌తో వచ్చిన చిక్కేనయ్యా ఇది! వాళ్లు కాని, ఎక్కౌంట్సు వాళ్ళు కాని ఓ.టి. చేస్తే మర్నాటి సాయంత్రానికల్లా డబ్బులు జేబులో వేసుకొంటారు. మనలాంటి టెక్నికల్ సెక్షన్స్ అనేసరికి, వంద అబ్జక్షన్లు పెట్టి నానా రాద్ధాంతం చేస్తారు. సరేలే, నువ్వు నోట్ పుటప్ చెయ్యి - నేను శాంక్షన్ తీసుకొంటాను" అన్నాడు ఎస్.ఇ.

నోట్ రాసి, ఆయన చేత సంతకం పెట్టించి ఫైల్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆఫీసుకి పంపించాను.

ఆ మధ్యాహ్నం మేనేజర్ అనుకోకుండా మా ఎస్.ఇ.కి ఛార్జి అప్పగించి, అర్జంటు పని మీద ఢిల్లీ వెళ్ళిపోయాడు.

మూడింటికి ఫైలు తిరిగి వచ్చింది. ఎకౌంట్సుకి పంపచ్చుకదా అని ఫైల్ తీసి, చూసి కొయ్యబారిపోయాను. "సకాలంలో పని చేయించలేకపోవడం ఆఫీసర్ల అసమర్థతని తెలియచేస్తోంది! ఓ.టి.కి ఒప్పుకోవడం లేదు. వీలున్నప్పుడు సి.ఓ. (కాంపెన్సేటరీ ఆఫ్) మంజూరు చెయ్యి." కింద మా ఎస్.ఇ. సంతకం. అడిగిందీ ఆయన సంతకం కిందనే! ఇవ్వనన్నదీ ఆయన సంతకం కిందనే!

నాకు తిక్క రేగింది. ఫైల్ తీసికొని మేనేజర్ ఆఫీసులో అడుగుపెట్టాను. రివాల్వింగ్ ఛైర్(కుర్చీ)లో కూర్చుని ఎస్.ఇ. ఏవో కాగితాలు చూస్తున్నాడు; మహదానందంగా. విసురుగా ఫైల్ బల్ల మీద వేయడంతో తల ఎత్తి చూశాడు. ఏమిటిదన్నట్టు చూశాను.

"తప్పు నాది కాదు, ఈ కుర్చీది! నువ్వీ కుర్చీలో కూర్చుంటే బాధ్యత తెలుస్తుంది. అయినదానికి, కానిదానికి ఓ.టి. ఇస్తూ కూర్చుంటే ఇహ పని జరిగినట్లే" అన్నాడు.

నాకాయనతో మరి మాట్లాడబుద్ధి కాలేదు. మౌనంగా బయటకొచ్చేశాను. వర్కర్స్‌కి ఏం సమాధానం చెప్పుకోగలను? మేనేజ్‌మెంట్‌కీ, వర్కర్స్‌కీ మధ్య నలిగి చచ్చే నాలాంటి వాళ్ళు మీలో కూడా చాలా మందే ఉంటారు. అటువంటి బాధ పగవాడికి కూడా వద్దు!

ఆ తరువాత ఏం జరిగిందీ నన్ను అడగవద్దు! ఆ మాయదారి కుర్చీ ప్రభావాన్ని చాలా రోజులు తిట్టుకున్నాను.

ఒక్కొక్కప్పుడు మరొక విధంగా కూడా కుర్చీ విలువ పెరిగిపోయి, దాని కోసం నానా పాట్లు పడవలసి వస్తుంది. నాటకాలకీ, నాట్యాలకీ, గానసభలకీ ముందు కుర్చీలకి గిరాకీ. సినిమాలకి వెనక కుర్చీలకి గిరాకీ.

పక్క కుర్చీకి గిరాకీ హెచ్చే ఒక చిన్న ఉదంతం చెబుతాను. యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లో ఒక ఆదివారం ఉదయం లీలామహల్లో ఇంగ్లీషు సినిమాకని పోయాం నేనూ, రూమ్‌మేట్ రామేశం. ఒక వరసలో చివరి రెండు సీట్లూ వదలి, తర్వాత రెండూ మావి. చివరి రెండూ వదిలి మూడో సీట్లో నేనూ, నా పక్కన రామేశం కూర్చున్నాం. మరో రెండు నిముషాల్లో ఇరవై ఏళ్ళ ఒక ఆంగ్లో ఇండియన్ యువతి, ఆమె తల్లి అనుకుంటాను - మరో ముసలామె వచ్చి ఆ చివరి రెండు సీట్లలో కూర్చున్నారు. ఆ పడుచు నా పక్కన కూర్చోవడంతో, రామేశం ఇబ్బంది పడిపోసాగాడు.

సినిమా మొదలైంది. మధ్య మధ్యలో మంచి హాస్యపు జల్లుల్ని కురిపిస్తోంది. విరగబడి నవ్వుతుంటే, ఆమె భుజాలు నన్ను స్పర్శిస్తోనే ఉన్నాయి. ఇంక రామేశానికి సినిమా మీద ధ్యాస లేకుండా పోయింది. మాటిమాటికీ నన్ను గిల్లడం మొదలుపెట్టాడు. ముందర నల్లులనుకొన్నాను! నల్లులు కాదని తెలియగానే, 'ఓర్నీ జెలసీ మండా!' అనుకొన్నాను.

విశ్రాంతి సమయంలో బయటకు పోయాం. వేడి కాఫీ అందుకుని రామేశం నా కంటే ముందుగా తాగేశాడు. హడావుడిగా హాల్లో అడుగుపెట్టాడు. అతగాడి తొందరకి చిన్నగా నవ్వుకొంటూ, బిల్లు చెల్లించి, సావధానంగా నేను హాల్లో ప్రవేశించాను. నేనను కున్నట్లుగానే రామేశం నే నంతకు ముందు కూర్చున్న కుర్చీలో కూర్చున్నాడు. నేను రామేశం పక్కన కూర్చున్నాను. బయటకు వెళ్ళిన వాళ్లు ఇద్దరూ లోపలికి వచ్చి, ముసలామె రామేశం పక్కనా, ఆ పడుచు చివరి సీట్లోనూ కూర్చోవడంతో, మా వాడి మొహాన నెత్తురు చుక్క లేదు! సినిమా అయేంత వరకూ నన్ను మరోసారి గిల్లి పోగులు పెట్టాడు!

జీవితంలో నేను చాలా రకాల కుర్చీల్లో కూర్చుని, చాలా రకాల బాధ్యతలు నిర్వహించాను. కాని - నేను హాయిగా ఫీలయ్యేది క్షౌరశాల కుర్చీలో కూర్చున్నప్పుడు! నేను కూర్చోవడానికి భయపడే కుర్చీ?.... దంత వైద్యుడిది! ●

*(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక : 16-8-1978)*